ఫైనల్‌లో తన్వి

బ్యాడ్మింటన్ ఆసియా అండర్-17 జూనియర్ చాంపియన్‌షిప్స్

చెంగ్డూ: భారత యువ షట్లర్ తన్వి పత్రి బ్యాడ్మింటన్ ఆసియా అండర్ -15 మహిళల సింగిల్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. చెంగ్డూ (చైనా) వేదికగా జరుగుతున్న అండర్-15, అండర్ -17 బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భాగంగా శనివారం ముగిసిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో ఒకటో సీడ్ తన్వి.. 21-19, 21-10తో కకానిక్ (థాయ్‌లాండ్)ను ఓడించి తుదిపోరుకు చేరింది. కాగా అం డర్-17 సెమీస్ బాలుర విభాగంలో జ్ఞాన దత్తు 9-21, 21-13, 21-13తో రదిథ్య బయు (ఇండోనేషియా) చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.

పురుష రెజ్లర్లకు నిరాశే

అమ్మాన్: జోర్డాన్‌లో జరుగుతున్న అండర్-17 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుష రెజ్లర్లకు నిరాశ తప్పడం లేదు. శుక్రవారం పురుషుల ఫ్రీ స్టయిల్ విభాగంలో ఐదుగురు బరిలోకి దిగితే ఒక్కరు కూడా క్వార్టర్స్‌కు చేరకపోగా శనివారమూ అవే ఫలితాలు పునరావృతమయ్యాయి. జస్పూరన్ సింగ్ (110 కిలోలు) ఒక్కడే కాంస్య పోరుకు అర్హత సాధించాడు. తొలి రౌండ్‌లోనే అతడు జపాన్ ప్ర త్యర్థి యుకీ యమమొటొ చేతిలో ఓ డాడు. కానీ యుకీ ఫైనల్ చేరడంతో రెపిచేజ్ రౌండ్‌తో జస్పూరన్ కాంస్య పోరుకు దూసుకెళ్లాడు.

ఇంగ్లండ్ విజయం

మాంచెస్టర్: స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో లంక నిర్దేశించిన 205 పరుగుల ఛేదనను 57.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఇంగ్లండ్ జట్టులో జో రూట్ (62), జెమీస్మిత్(39) రాణించారు. ఈ విజయంతో ఇంగ్లండ్ రెండు టెస్టుల సిరీస్ 1-0 ఆధిక్యంలో ఉంది. జెమీస్మిత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

గబ్బర్ అల్విదా

క్రికెట్‌కు వీడ్కోలు పలికిన శిఖర్ ధావన్

13 ఏండ్ల కెరీర్‌కు గుడ్‌బై

'మిస్టర్ ఐసీసీ'గా గుర్తింపు

భారత క్రికెట్ జట్టు మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. గత దశాబ్దిలో టీమ్‌ఇండియాకు రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా పరుగుల వరద పారించిన ధావన్.. 13 ఏండ్ల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు గుడ్ బై చెప్పేశాడు.అభిమానులు 'గబ్బర్' అని పిలుచుకునే ధావన్.. జాతీయ జట్టులో కుర్రాళ్ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోలేక రేసులో వెనుకబడ్డాడు.

ఐసీసీ నిర్వహించిన 2013, 2017 చాంపియన్స్ ట్రోఫీలలో విశ్వరూపమే చూపించిన గబ్బర్ 'మిస్టర్ ఐసీసీ'గా గుర్తింపు పొందాడు. రెండేండ్లుగా సెలక్టర్ల పిలుపు కోసం వేచి చూసిన ధావన్ 'ఇక ఆ అవకాశం లేకపోవడం'తో రిటైర్మెంట్ ప్రకటించాడు.



ఢిల్లీ: టీమ్‌ఇండియా గబ్బర్ శిఖర్ ధావన్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2010లో భారత జట్టులోకి అరంగేట్రం చేసిన ధావన్.. 13 ఏండ్ల కెరీర్‌కు గుడ్ బై చెబుతున్నట్టు శనివారం ఓ వీడియో సందేశం ద్వారా వెల్లడించాడు. 2010లో జాతీయ జట్టులోకి వచ్చిన ధావన్.. చివరిసారిగా 2022లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. సెహ్వాగ్, గంభీర్ వంటి ఓపెనర్లు కెరీర్ చరమాంకంలో ఉండగా టీమ్‌ఇండియాలోకి ఎంట్రీ ఇచ్చిన అతడు.. వారిని మరిపిస్తూ రోహిత్‌తో రికార్డు భాగస్వామ్యాలను నెలకొల్పాడు. ఆఫ్‌సైడ్ అదిరిపోయే ఆటతో, చూడముచ్చటైన కవర్ డ్రైవ్‌లతో అభిమానులను అలరించిన అతడు జాతీయ జట్టులో యువ ఆటగాళ్ల నుంచి ఎదురవుతున్న పోటీతో పాటు వయసు, ఫిట్‌నెస్ సమస్యలతో అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్టు తెలిపాడు. ఈ సందర్భంగా ధావన్ మాట్లాడుతూ.. 'నా ఈ క్రికెట్ ప్రయాణంలో వెనక్కి తిరిగి చూసుకుంటే ఎన్నో జ్ఞాపకాలు. ముందుకెళ్తే కొత్త జీవితం. లైఫ్‌లో నాకు దేశానికి ఆడాలనే లక్ష్యం ఒకటే ఉండేది. అదృష్టం కొద్దీ అది నన్ను వరించింది. నాకు అండగా నిలిచి, నాకు ప్రేమను పంచినవారందరికీ ధన్యవాదాలు. ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి ప్రత్యేక కృతజ్ఞతలు. జై హింద్' అని వీడియోలో పేర్కొన్నాడు.

అండర్ -19 వరల్డ్ కప్‌తో మొదలై..

2004లో జరిగిన అండర్-19 వరల్డ్ కప్‌లో మూడు సెంచరీలు చేసిన ధావన్ జాతీయ సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు. 2010లో అతడికి వన్డేలలో తొలి అవకాశం వచ్చినా మొదటి మ్యాచ్‌లోనే డకౌట్ అయి నిరాశపరిచాడు. ఆ తర్వాత జట్టులోకి వస్తూ పోతూ ఉన్నా 2013 నుంచి మాత్రం తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఆ ఏడాది జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీతో రోహిత్ శర్మతో కలిసి ధావన్ సంచలన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అదే ఏడాది ఆస్ట్రేలియాతో మొహాలీ టెస్టులో భారీ శతకంతో రికార్డులు నెలకొల్పడంతో ఇక అప్పట్నుంచి అతడు వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ధోనీ హయాంలో 2013 నుంచి 2019 మధ్య రోహిత్, కోహ్లీతో కలిసి ధావన్ ఓ వెలుగు వెలిగాడు. 2013, 2017 చాంపియన్స్ ట్రోఫీలలో అత్యధిక పరుగులు చేసి 'గోల్డెన్ బ్యాట్' అవార్డులు సొంతం చేసుకున్నాడు.

2018 నుంచి ఫేడ్ అవుట్..

2018 తర్వాత టెస్టు జట్టులో స్థానం కోల్పోయిన ధావన్ క్రమంగా పరిమిత ఓవర్ల ఫార్మాట్‌కూ దూరమవుతూ వచ్చాడు. ఆటతో పాటు కుటుంబ సమస్యలతో సతమతమైన అతడిని టెస్టులతో పాటు టీ20లలోనూ సెలక్టర్లు పక్కనబెట్టినా వన్డేలలో మాత్రం తరుచుగా ఆడాడు. ఒక దశలో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే వంటి పర్యటనలలో భారత ద్వితీయ శ్రేణి జట్టుకు సారథిగానూ వ్యవహరించాడు. ధావన్ చివరిసారిగా 2022లో బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌లో ఆడాడు. ఆ తర్వాత శుభ్‌మన్ గిల్, యశస్వీ జైస్వాల్ వంటి కుర్రాళ్ల రాకతో సెలక్టర్లు ధావన్‌ను పూర్తిగా పక్కనబెట్టేశారు.

> జీవితంలో ముందుకెళ్లాలంటే కొన్ని పేజీలు తిప్పక మానదు. అందుకే అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నా. ఈ సుదీర్ఘ క్రికెట్ ప్రయాణానికి వీడ్కోలు పలుకుతుంటే నా మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంది. నా దేశం కోసం నేను ఎంతో ఆడా. ఇకపై మళ్లీ నాకు ఆ అవకాశం రాకపోవచ్చు. కానీ అందుకు బాధపడాల్సిన అవసరం లేదని నా మనసుకు చెప్పుకున్నా – ధావన్

కెరీర్‌లో మైలురాళ్లు

ఫార్మాట్	మ్యాచ్‌లు	పరుగులు	సగటు	శతకాలు
వన్డేలు	167	6,793	44.11	17
టెస్టులు	34	2,315	40.61	07
టీ20లు	68	1,579	27.92	-

రోహిత్-ధావన్ ఓపెనింగ్ భాగస్వామ్యం 117 ఇన్నింగ్స్‌లలో 5,193 పరుగులు. భారత్‌లో సచిన్, గంగూలీ (6,609) తర్వాత ఇదే అత్యధికం.

చాంపియన్స్ ట్రోఫీ (2013, 2017)లలో ధావన్ విశ్వరూపం

114 102 48 68 31 68 125 78 46 21

2013, 2017 చాంపియన్స్ ట్రోఫీతో పాటు 2015 వన్డే వరల్డ్ కప్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా ధావన్ నిలిచాడు. అంతేగాక ఐసీసీ టోర్నీలలో అత్యంత వేగంగా వెయ్యి పరుగులు పూర్తి చేసిన బ్యాటర్. అందుకే అభిమానులు అతడిని 'మిస్టర్ ఐసీసీ'గా పిలుస్తారు.

వందో వన్డేలో ఆడుతూ సెంచరీ చేసిన తొలి భారత క్రికెటర్ ధావన్.

బంగ్లా అదుర్స్

డ్రా దిశగా రావల్పిండి టెస్టు

రావల్పిండి: పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ బ్యాటర్లు అదరగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 565 పరుగుల భారీ స్కోరు చేసిన బంగ్లా.. ఆతిథ్య జట్టుకు దీటైన జవాబిచ్చింది. ముష్ఫీకర్ రహీమ్ (191) తృటిలో ద్విశతకాన్ని కోల్పోగా మెహిది హసన్ మిరాజ్ (77) రాణించడంతో ఆ జట్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 117 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించింది. నాలుగో రోజు ఆటలో లిటన్ దాస్ (56) త్వరగానే నిష్క్రమించినా మిరాజ్‌తో ఏడో వికెట్‌కు 196 పరుగులు జోడించిన ముష్ఫీకర్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. రావల్పిండి పిచ్‌పై షహీన్ అఫ్రిది (2/88), నసీమ్ షా (3/93) వంటి స్టార్ పేసర్లు వికెట్లు తీయడంలో విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 448/6 పరుగులు చేసిన విషయం విదితమే. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ ఓపెనర్ సయీమ్ అయూబ్ (1) వికెట్‌ను కోల్పోయి 23 పరుగులు చేసింది. ఒక్క రోజు ఆట మాత్రమే మిగిలుండటంతో ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ఈ మ్యాచ్‌లో ఫలితం తేలడం అసాధ్యం.

ఘనంగా మొదలైన ఇండియన్ రేసింగ్ లీగ్

తొలి రౌండ్‌లో లాంకాస్టర్, జాడెన్ విజయం

చెన్నై: భారత్‌లో రేసింగ్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) శనివారం చెన్నైలో అట్టహాసంగా మొదలైంది. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం జరిగిన ఐఆర్ఎల్, ఫార్ములా-4 ఇండియన్ చాంపియన్‌షిప్ ఆరంభ రేసుల్లో చెన్నై టర్బో రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న జోన్ లాంకాస్టర్, బెంగళూరు స్పీడ్‌స్టర్స్ డ్రైవర్ జాడెన్ పరియాట్ విజేతలుగా నిలిచారు. ఎ-లెవల్ డ్రైవర్ల కోసం నిర్వహించిన రేసులో లాంకాస్టర్ రేసును 27 నిమిషాల 15.812 సెకన్లలో పూర్తిచేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఇక ఎఫ్-4 ఇండియన్ చాంపియన్‌షిప్ రేసును 21 నిమిషాల 14.967 సెకన్లలో పూర్తిచేసిన జాడెన్ అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు. బెంగళూరు యువ డ్రైవర్, ఈ లీగ్‌లో శ్రాచి రాయల్ బెంగాల్ టైగర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రుహాన్ అల్వా ఐఆర్ఎల్, ఎఫ్4 ఇండియా చాంపియన్‌షిప్‌లలోనూ మూడో స్థానంలో నిలిచాడు. కాగా ఈ లీగ్‌లో భారీ ఆశలతో బరిలోకి దిగిన హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ రెండు రేసుల్లోనూ నిరాశపరిచింది.

సతియన్ సంచలనం సృష్టించినా..

- దబాంగ్ ఢిల్లీకి తప్పని ఓటమి
- అల్టిమేట్ టేబుల్ టెన్నిస్

చెన్నై: భారత స్టార్ ప్యాడ్లర్ సతియన్ జ్ఞానశేఖరన్ సంచలన ప్రదర్శనతో ప్రపంచ 20వ ర్యాంకు ఆటగాడు ఖ్వాద్రి అరుణను ఓడించినా అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న దబాంగ్ ఢిల్లీకి తొలి మ్యాచ్‌లో ఓటమి తప్పలేదు. అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)లో భాగంగా చెన్నైలో యూముంబాతో జరిగిన పోరులో 9-6తో ఢిల్లీ పరాభవంతో ఈ సీజన్‌ను ప్రారంభించింది. పురుషుల సింగిల్స్‌లో సతియన్ 2-1తో ఖ్వాద్రిపై గెలిచినా మహిళల సింగిల్స్‌లో ముంబై ప్యాడ్లర్ సురిత ముఖర్జీ.. దియా చిటాలెపై వరుసగా మూడు సెట్లలో గెలిచి ఆ జట్టును పోటీలోకి తెచ్చింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మానవ్ ఠక్కర్, మరియ ద్వయం.. 2-1తో సతియన్, ఒరవన్‌ను ఓడించారు. అనంతరం ఠక్కర్.. 2-1తో అండ్రీస్‌ను చిత్తు చేశాడు. మహిళల సింగిల్స్‌లో మరియ 1-2తో ఒరవన్ చేతిలో ఓటమిపాలైంది. ఆదివారం జరిగే మ్యాచ్‌లలో ఢిల్లీ.. చెన్నై లయన్స్‌తో తలపడనుండగా యూముంబా.. జైపూర్ ప్యాట్రియట్స్‌ను ఢీకొననుంది.

కలిసొచ్చే కాలానికి నడిసొస్తున్న సినిమా

''ఎప్పుడెప్పుడు ఆడియన్స్‌తో కలిసి సినిమా చూస్తానా అని ఆశగా ఎదురుచూస్తున్నా. వివేక్ గొప్ప సినిమా తీశాడు. అతని శివ తాండవం ఈ నెల 29న చూస్తారు. మ్యూజిక్ డైరెక్టర్ జేక్స్ ఆర్.ఆర్‌తో సినిమాను మరోస్థాయిలో నిలబెట్టాడు. క్వాలిటీకోసం అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. కలిసొచ్చే కాలానికి నడిసొస్తున్న సినిమా మా 'సరిపోదా శనివారం'.'' అని హీరో నాని అన్నారు. ఆయన హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సరిపోదా శనివారం'. డి.వి.వి.దానయ్య సమర్పకుడు. కల్యాణ్ దాసరి నిర్మాత. ఈ నెల 29న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌తో నాని మాట్లాడారు. నిర్మాత డీవీవీ దానయ్య మాట్లాడుతూ 'సినిమా చూశాను. బ్లాక్‌బాస్టర్ అవుతుంది. కథల సెలక్షన్లలో నాని నంబర్‌వన్. ఆయనతో సినిమాలు చేస్తే ప్రొడ్యూసర్‌కి టెన్షన్ ఉండదు. దర్శకుడు వివేక్ పెద్ద కమర్షియల్ డైరెక్టర్ అవుతాడు.' అని జోస్యం చెప్పారు. 'నాని నాకు ఛాన్స్ ఇవ్వలేదు. కాన్ఫిడెన్స్ ఇచ్చారు. 'సరిపోదా శనివారం'తో నాని నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నా' అని దర్శకుడు వివేక్ ఆత్రేయ పేర్కొన్నారు. ఇంకా ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్.జె.సూర్య, దర్శకులు దేవ కట్టా, ప్రశాంత్‌వర్మ, శైలేష్ కొలను, శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్, నిర్మాత సుధాకర్ చెరుకూరి, అలీ, అభిరామి, అదితి, అనితాచౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయ్ సేతుపతి జోడీగా..

చిత్రం

ఇటీవల ప్రకటించిన జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ నటిగా అవార్డును కైవసం చేసుకుంది అగ్ర కథానాయిక నిత్యామీనన్. తమిళ చిత్రం 'తిరుచిత్రాంబలమ్'కు గాను ఆమె ఈ అవార్డును గెలుచుకుంది. తాజాగా ఈ అమ్మడు తమిళంలో మరో భారీ ఆఫర్ సొంతం చేసుకుంది. అగ్ర నటుడు విజయ్ సేతుపతికి జోడీగా నిత్యామీనన్ నటించనుంది. పాండిరాజ్ దర్శకత్వంలో ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. సత్యజ్యోతి ఫిల్మ్స్ నిర్మించనున్న ఈ సినిమా త్వరలో సెట్స్ మీదకు వెళ్లనుంది. ఇటీవల విడుదలైన 'మహారాజ' సినిమా సక్సెస్‌తో విజయ్‌సేతుపతి కెరీర్‌లో దూసుకుపోతున్నారు. మరోవైపు జాతీయ అవార్డుతో నిత్యామీనన్ సత్తా చాటింది. ఈ ఇద్దరు వెర్సటైల్ ఆర్టిస్టుల కాంబినేషన్‌లో సినిమా వస్తుండడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పక్షి రెక్కలు తెచ్చిన తంట

మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా తొలి ప్రకటన కోసం దేశంలోని సినీప్రియులంతా ఎదురుచూస్తున్నారని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. తాజాగా ఈ సినిమా విషయంలో ఓ వార్త మీడియా సర్కిల్స్‌లో ఓ రేంజ్‌లో హల్‌చల్ చేస్తున్నది. ఈ సినిమాకు పనిచేస్తున్న ఓ విజువల్ ఆర్టిస్ట్ సోషల్ మీడియాలో ఓ ఆర్ట్ ఫ్రేమ్‌ను పోస్ట్ చేశాడు. అది రెండు పక్షి రెక్కలతో కూడుకున్న ఆర్ట్ పిక్. దీంతో ఇప్పుడు రచ్చ మొదలైంది. మహేశ్, రాజమౌళి సినిమాను ఉద్దేశించే అతను ఈ పోస్ట్ పెట్టారని, ఆ సినిమా 'గరుడ' అనే టైటిల్‌తో రానున్నదని, గతంలో ఈ 'గరుడ' అనే టైటిల్ గురించి రాజమౌళి మాట్లాడారని, దాదాపు పదేళ్ల క్రితమే లాక్ చేసిన ఆ కథతోనే రాజమౌళి సినిమా తీయనున్నారని సోషల్ మీడియాలో వార్త తెగ వైరల్ అవుతున్నది. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఆ విజువల్ ఆర్టిస్ట్ పోస్ట్ చేసిన ఆర్ట్ పిక్‌కూ, రాజమౌళి, మహేశ్ సినిమాకు ఏ మాత్రం సంబంధం లేదని తెలుస్తున్నది. 'గరుడ' రాజమౌళి డ్రీమ్ ప్రాజెక్టని, అది మూడువేల కోట్ల భారీ ప్రాజెక్ట్ అని, మహేశ్ సినిమా అమేజాన్ ఫారెస్ట్ ట్రజర్ హంట్ నేపథ్యంలో ఉంటుందని, ఇది కూడా దాదాపు 1500కోట్ల నిర్మాణ వ్యయంతో తెరకెక్కనున్నదని, ఈ ఏడాది చివర్లో ఈ సినిమా వివరాలు ప్రకటించవచ్చని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి.

కడుపుబ్బా నవ్విస్తాం

సుహాస్, సంగీర్తన జంటగా దిల్‌రాజు ప్రొడక్షన్స్‌లో రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకుడు. హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మాతలు. సెప్టెంబర్ 7న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ఫైనల్ వెర్షన్ చూసిన సుహాస్, యూఎస్ఏ హక్కులను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ 'ఫైనల్ వెర్షన్ చూశాక, ఆలస్యం చేయకుండా యుఎస్ఏ హక్కులు తీసుకున్నా. ఇది పక్క ఎంటర్టైనర్. ప్రతిదానికీ లెక్కలు చెప్పే మిడిల్‌క్లాస్ కుర్రాడిగా ఇందులో కనిపిస్తా. ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్వించే సినిమా ఇది.' అని చెప్పారు. రాజేంద్రప్రసాద్, గోపరాజు రమణ ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: విజయ్ బుల్గానిన్.

ప్రాణంపెట్టి పనిచేశారు కాబట్టే ఈ విజయం

'110 స్క్రీన్స్‌లో సినిమా విడుదలైంది. ఇప్పుడు 382 స్క్రీన్లకు వెళ్లింది. యూఎస్‌లో 27 స్క్రీన్లలో విడుదల చేశాం. ప్రస్తుతం 86 స్క్రీన్లు ఆడుతున్నది. మంచి కంటెంట్‌తో సినిమా తీస్తే, మౌత్ టాక్ బావుంటే సినిమా ఏ స్థాయి విజయాన్ని అందుకుంటుందో మా 'ఆయ్' సినిమా రుజువు చేసింది. శుక్రవారం నాటికి 11కోట్ల గ్రాస్‌కి పైగా వసూలు చేసింది. ఇప్పటికీ 60,70 శాతం ఆక్యుపెన్సీ కనిపిస్తుంది. అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. కాబట్టే ఈ విజయం' అని బన్నీవాసు అన్నారు. నార్నె నితిన్, నయన్ సారిక జంటగా విద్య కొప్పినీడుతో కలిసి ఆయన నిర్మించిన చిత్రం 'ఆయ్'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఆగస్ట్ 15న విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సక్సెస్‌మీట్‌లో బన్నీవాసు మాట్లాడారు. చిన్న సినిమాకు పెద్ద విజయాన్ని ఇచ్చిన ఆడియన్స్‌కి థ్యాంక్సనీ, ఇది థియేటర్లలో మాత్రమే చూడాల్సిన సినిమా అనీ, చూడాల్సిన వాళ్లుంటే త్వరగా చూడండనీ దర్శకుడు చెప్పారు. ఇంకా నార్నె నితిన్‌తోపాటు చిత్ర తారాగణం అంతా మాట్లాడారు. యువ నిర్మాత ఎస్.కె.ఎన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమరన్‌గా శివకార్తికేయన్

తమిళ అగ్రహీరో శివకార్తికేయన్ యాక్షన్ చిత్రం 'అమరన్'. ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు పెరియస్వామి రచన, దర్శకత్వం వహించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్టైన్మెంట్‌తో కలిసి విఖ్యాత నటుడు కమల్‌హాసన్, ఆర్.రామచంద్రన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దీపావళి కానుకగా అక్టోబర్ 31న సినిమా విడుదల కానుంది. కాగా, హీరో నితిన్ తండ్రి, ప్రముఖ పంపిణీదారుడు సుధాకర్‌రెడ్డి, అతని సోదరి నిఖితారెడ్డి ఈ సినిమా ఏపీ, తెలంగాణ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్ ద్వారా ఈ సినిమా విడుదల కానుంది. కమల్‌హాసన్ రీసెంట్ బ్లాక్‌బాస్టర్ 'విక్రమ్'ని కూడా శ్రేష్ఠ్ మూవీసే తెలుగులో విడుదల చేసింది. 'విక్రమ్'ని భారీగా విడుదల చేసిన శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా తాను నిర్మిస్తున్న 'అమరన్' కూడా విడుదల అవుతుండటం పట్ల కమల్ ఆనందం వ్యక్తం చేశారు. మునుపెన్నడూ చూడని కొత్త తరహా పాత్రలో శివకార్తికేయన్ నటిస్తున్న ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయిక. ఈ చిత్రానికి కెమెరా: సీహెచ్ సాయి, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.

సోలో బాయ్ స్వరాలు

'బిగ్‌బాస్'ఫేం గౌతమ్ కృష్ణ హీరోగా రూపొందుతున్న చిత్రం 'సోలో బాయ్'. పి.నవీన్‌కుమార్ దర్శకుడు. సెవెన్ హిల్స్ సతీశ్‌కుమార్ నిర్మాత. ఈ సినిమా నిర్మాణం తుదిదశకు చేరుకుంది. శనివారం ఈ సినిమా ఫస్ట్ సింగిల్‌ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. సపోర్ట్ చేసిన టీమ్‌కి దర్శకుడు కృతజ్ఞతలు తెలిపారు. 'సోలో బాయ్' మంచి సినిమా అని, దర్శకుడు నవీన్‌కుమార్ అద్భుతమైన కథ రాసుకుని, అంతే అద్భుతంగా తెరక్కెంచాడని, గౌతమ్‌కృష్ణ భవిష్యత్‌లో పెద్ద హీరో అవుతాడని నిర్మాత చెప్పారు. నీలో మంచి రిథమ్ ఉందని, కష్టపడితే కచ్చితంగా పెద్ద డాన్సర్‌వి అవుతావని సందీప్ మాస్టర్ చెప్పి, నాతో అద్భుతంగా డాన్స్ చేయించాడని, ఈ సినిమా సక్సెస్ కోసం పనిచేసిన అందరికీ థ్యాంక్సని హీరో గౌతమ్‌కృష్ణ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా సంధ్య.

'బంపర్' లాటరీ నేపథ్యంలో..

తమిళ చిత్రం 'బంపర్' తెలుగులో విడుదల కానుంది. వెట్రి, శివాని నారాయణన్ జంటగా నటించిన ఈ చిత్రానికి ఎం.సెల్వకుమార్ దర్శకుడు. ఎస్.త్యాగరాజన్, టి.ఆనందజ్యోతి నిర్మాతలు. త్వరలో సినిమా విడుదలకానుంది. శనివారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది కేరళలోని 'బంపర్' అనే లాటరీ నేపథ్యంలో సాగే కథ. ఫ్రెండ్స్‌తో కలిసి అయ్యప్పమాల వేసుకుని కేరళ వెళ్లిన ఓ కుర్రాడు అక్కడ 'బంపర్' లాటరీ కొంటాడు. ఆ టికెట్‌కు ప్రైజ్ మనీ వస్తుంది. దాన్ని చేజిక్కించుకునేందుకు అతను పడ్డ కష్టాలు, ఫ్రెండ్స్‌తో పడ్డ ఇబ్బందుల నేపథ్యంలో వినోదాత్మక థ్రిల్లర్‌గా తెరకెక్కిన సినిమా ఇది. ఇది మా నాన్న జీవితంలో ఎదుర్కొన్న సంఘటన ఆధారంగా రాసుకున్న కథ. అందరికీ ఈ సినిమా నచ్చుతుంది' అని చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

ఇది స్ట్రెస్ రిలీఫ్ సినిమా

లక్ష్మణమూర్తి రతన, భ్రమరాంబిక తూటిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సీతారాం సిత్రాలు'. డి. నాగ శశిధర్‌రెడ్డి దర్శకుడు. పి.పార్థసారథి, డి.నాగేంద్రరెడ్డి, కృష్ణచంద్ర విజయబట్టు నిర్మాతలు. ఈ నెల 30న సినిమా విడుదల కానుంది. శనివారం ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన యువ హీరో ఆకాశ్ జగన్నాథ్ ట్రైలర్‌ని విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఇది స్ట్రెస్ రిలీఫ్ సినిమా అని, ఆడియన్స్ రెండుగంటల పాటు హాయిగా నవ్వుకునేలా సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. గుడికి వెళ్తే ఎంత ప్రశాంతంగా ఉంటుందో మా సినిమా చూస్తే అంత ప్రశాంతంగా ఉంటుందని హీరో అన్నారు. ఇంకా నిర్మాతలతో పాటు కథానాయిక భ్రమరాంబిక కూడా మాట్లాడారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,